ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.6లక్షలు అందజేత

రూ.6లక్షల చెక్కును అందజేస్తున్న నాయకులు

వైరా టౌన్/బోనకల్లు, ఏప్రిల్ 21: టీఎస్ యూటీఎఫ్ సీనియర్ కార్యకర్త, వైరా మండలం పాలడుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగసాని శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందారు. ఆయన సంతాప సభ స్వగ్రామమైన బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో ఆదివారం జరిగింది. టీఎస్ యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ నుంచి గంగసాని కుటుంబానికి రూ.6లక్షల విరాళం చెక్కును రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఫండ్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పారుపల్లి నాగేశ్వరరావు, ఉద్దండు షరీఫ్, వైరా ఎంఈవో కె.వెంకటేశ్వర్లు కలిసి అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ సభ్యులకు ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ అండగా ఉంటుందని, ముఖ్యంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ఉద్యోగులకు మరింతగా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రంజాన్, బి.శ్రీనివాసరెడ్డి, జి.రామకృష్ణ, హనుమంతరావు, సర్వర్‌బాబు, కెసి.వెంకటేశ్వర్లు, జివి.కృష్ణారావు, జి.నాగేశ్వరరావు, షేక్ జరీనా, లక్ష్మి, సునీత, చంద్రశేఖర్, యోహాన్, చల్లా కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 21: డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం మొదటి సంవత్సరం డిగ్రీ చదివే విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక జే.వీ.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ కార్యకలాపాలతో పాటు సెమిష్టర్ విధానంలో పరీక్షలు, ప్రాక్టీకల్స్, మోడల్ పేపర్స్, అంబేద్కర్ యూనివర్సిటీ, మొబైల్ యాప్ వినియోగించే విధానం, యూనివర్సిటీ యూట్యూబ్ తరగతులు, విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. గత రెండు నెలలుగా మొదటి సంవత్సరం సెమిష్టర్ తరగతులను ఆదివారాల్లో నిర్వహిస్తున్నామన్నారు. మే నెలలో జరిగే తరగతులకు ఫీజును మే 6 లోగా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు రామచంద్రరావు, రాంబాబు, విజయలక్ష్మీ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నిర్మాణం

ఆలయానికి స్లాబ్ వేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 21: సత్తుపల్లి ద్వారకాపుర్ కాలనీ 7వ వీధిలో నిర్మాణంలో ఉన్న శ్రీప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆదివారం ఆలయ ముఖ మండపం, గర్భాలయానికి స్లాబ్ వేశారు. త్వరలో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకొని యంత్ర ప్రతిష్ఠా కార్యక్రమం జరుపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సోమిశెట్టి శ్రీధర్, కార్యదర్శి ఉబ్బల వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఆలయానికి దాతలు విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్మాణ పర్యవేక్షకులు రామరాజు మల్లికార్జునశర్మ, రాగల చంద్రారెడ్డి, తోట కిరణ్, గాదె నాగు, రమేష్‌రెడ్డి, విష్ణురెడ్డి, సారధిరెడ్డి, ప్రవీణ్, సురేష్‌ప్రకాశ్, నాగార్జున్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

వైరా : అవగాహన కల్పిస్తున్న కమిషనర్

వైరా టౌన్, ఏప్రిల్ 21: ఓటు హక్కు వినియోగంపై పట్టణంలో పలుచోట్ల అవగాహన సమావేశాలను మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వేణు ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లి, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ విధిగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని డాక్టర్స్ రెసిడెన్సీ వద్ద స్వీప్ ఓటర్ అవేర్‌నోస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ సభ్యులు, మెప్మా, సిబ్బంది ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి మృతి

డోర్నకల్, ఏప్రిల్ 21: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ శివారులో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రాముకుంట తండాకు చెందిన తేజావత్ జస్వంత్, తేజావత్ మంగీలాల్ బైక్‌పై డోర్నకల్ నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఖమ్మం జిల్లా ఆరెకోడు తండాకు చెందిన బానోత్ మోహన్, అనూష, పార్వతి బైక్‌పై బర్లగూడెంలోని ఓ ఫంక్షన్‌కు వెళ్తున్నారు. డోర్నకల్ శివారులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా తేజావత్ జస్వంత్ (23), బానోత్ మోహన్ (40) మృతిచెందారు. తేజావత్ మంగీలాల్ పరిస్థితి విషమంగా ఉంది. అనూష, పార్వతికి గాయాలు కాగా, ముగ్గురిని 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఓటేసి నన్ను పార్లమెంట్‌కు పంపించండి

- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

వాకర్స్‌తో మాట్లాడుతూ ఓట్లను అభ్యర్థిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 21: త్వరలో జరగబోయే ఎన్నికల్లో తనకు ఓటేసి పార్లమెంట్‌కు పంపించాలని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌లో వాకర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకింగ్ చేస్తున్న ప్రతిఒక్కరిని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడి తనకు ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన గెలుపు ద్వారా కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలన్నారు. తనను గెలిపించడం అంటే తెలంగాణా అభివృద్ధిని బలపర్చడమేనన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే తెలంగాణా ప్రయోజనాలు, హక్కులు కాపాడబడతాయని తెలిపారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, జస్వంత్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, వాకర్స్‌క్లబ్ కార్యదర్శి ఖాదర్‌బాబు, కోశాధికారి గడిపూడి జనార్దన్‌రావు, గుత్తా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జైపాల్, మోరంపూడి ప్రసాద్, గోడ్డేటి మాధవరావు, తాళ్లూరి హరీష్ , చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా రఘునాధపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గాజుల వీరయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మమేకమయ్యారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, శీలంశెట్టి వీరభద్రం, యసా రామారావు, మెంటెం రామారావు, యెల్ల బాబు, ఆకుల గాంధీ, కనగంటి హన్మంతరావు, రవి, గోవర్దన్, తులస్య, పుల్లయ్య పాల్గొన్నారు.

రక్త దాతలే ప్రాణదాతలు..!

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గిరిసింహారావు

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 21: తలసేమియా చిన్నారులు రక్తం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి రక్తం ఇచ్చి ప్రాణ దాతలుగా మారుతున్నారని ప్రముఖ వైద్యుడు గిరిసింహారావు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని తలసేమియా డే కేర్ సెంటర్ (రితన్య ఆసుపత్రి)లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గిరిసింహారావు, డాక్టర్ నారాయణమూర్తి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారుల రక్షణ కోసం సంకల్ప సేవలు అభినందనీయమన్నారు. ప్రతిరోజు బాధితులకు అవసరమైన రక్త సేకరణకు సంస్థ బాధ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దాతలు స్పందిస్తే ఈ వేసవిలో చిన్నారులను కాపాడిన వారవుతారన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి పీ రామారావు, సంస్థ ఉపాధ్యక్షురాలు పీ పావని, బాధ్యులు ఉదయ్‌భాస్కర్, పీ అనిత, ఎన్ ఉపేందర్, సైదులు పాల్గొన్నారు.

మల్లేశ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ

మల్లేశ్‌ను పరామర్శిస్తున్న పువ్వాడ అజయ్ కుమార్

రఘునాథపాలెం, ఏప్రిల్ 21: ఖమ్మం నగరం కొత్తగూడెం ప్రాంతానికి చెందిన సీపీఐ నాయకుడు పగడాల మల్లేశ్ కుమారుడు భరత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం కొత్తగూడెం వెళ్లి మృతుడు భరత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మల్లేశ్‌ను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నాయకులు మొర్రిమేకల కోటయ్య, సత్తి గోపాలరావు తదితరులు ఉన్నారు.

రెస్క్యూ సభ్యుల సేవలు అనిర్వచనీయం

మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

రామవరం, ఏప్రిల్ 21 : సింగరేణి సంస్థలో ఆపద కాలంలో రెస్క్యూ టీం సేవలు అనిర్వచనీయమని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజు అన్నారు. ఆదివారం ఏరియా పరిధిలోని గౌతంపూర్ కమ్యూనిటీహాల్‌లో రీజనల్ ఇల్లెందు, కొత్తగూడెం ఏరియా, మణుగూరు ఏరియాలో శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరికరాలను ఉపయోగించుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

పెద్దమ్మతల్లి సన్నిధిలో భక్తుల సందడి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 21 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులతో సందడి వాతావరణం ఏర్పడింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగ చూడమని వేడుకున్నారు. పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, మధిర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ పిల్లలకు అన్నప్రాసన, తలనీలాల కార్యక్రమాలు జరుపుకున్నారు. సత్రాలు నిండిపోవడంతో చెట్ల కింద వంటా వార్పు చేపట్టారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో సుదర్శన్ పర్యవేక్షించారు. 23వ తేదీన చండీహోమం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి వితరణ

మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి ఏసీని వితరణగా ఇస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు, పీవీకే 5గని అధికారులు, ఉద్యోగులు

రామవరం, ఏప్రిల్ 21 : భద్రాచలంలోని మానవసేవ అనాథ, వృద్ధ, మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి రూ.లక్షా 25 వేలు విలువ గల ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్‌మిషన్, నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. పీవీకే 5 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారుల జీతం నుంచి ప్రతి నెలా రూ.50 చొప్పున సేకరించి ఆదివారం అందజేశారు. బి.రవీందర్, శ్రీనివాస్, వి.అజయ్, సాయి, పవన్, వై.శంకర్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఉన్నారు.

కలప పట్టివేత

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆటవీ రేంజ్ పరిధిలో అక్రమంగా తరలించేందుకు ఉంచిన కలపను ఎఫ్‌డీవో కే వెంకన్న అధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అదివారం మండలంలోని సత్యనారాయణపురం లోని వాగు పక్క చెట్ల పొదల్లో దాచి ఉన్న కలపను విశ్వసనీయ సమాచరం మేరకు తనీఖీలు చేపట్టి 60 కలప దుంగలను గర్తుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.30లక్షలు ఉంటుందని ఎఫ్‌డీవో వెంకన్న తెలిపారు. ఈ దాడుల్లో బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుమీద నుంచి పడి వ్యక్తి మృతి

పాల్వంచ, ఏప్రిల్ 21 : కేటీపీఎస్‌కు చెందిన జెన్కోకాలనీ సబ్‌స్టేషన్‌లో(పీఏ)గా పనిచేస్తున్న ఎండీ గౌస్(48) మామిడిచెట్టుపై నుంచి కింద పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేటీపీఎస్ 5వ కర్మాగారంలో పీఏగా పనిచేస్తున్న గౌస్ శనివారం నైట్ డ్యూటీ చేసి ఆదివారం ఇంటికి వస్తుండగా గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న మామిడిచెట్టు కాయలు కోసుకొని పోదామని ఎక్కి ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణుగూరుకు చేరిన ఈవీఎంలు

స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన అధికారులు

స్ట్రాంగ్ రూమ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న టీడీఏ పీవో ప్రతీక్‌జైన్

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: పార్లమెంటు ఎన్నికల కోసం పినపాక నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలు శనివారం రాత్రి మణుగూరుకు చేరుకున్నాయి. ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆధ్వర్యంలో మణుగూరు జడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో వీటితోపాటు ఎన్నికల సామాగ్రిని కూడా భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద అధికారులు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటుచేశారు. మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, సీఐ సతీశ్‌కుమార్, ఆర్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనగడపలో తాగునీటికి కటకట

ట్యాంకుల ద్వారా నీటిని పట్టుకుంటున్న పెనగడప వాసులు

చుంచుపల్లి, ఏప్రిల్ 21: ఎండాకాలంలో నీరు లేకపోతే చాలా ఇబ్బందిగా ఉంటుంది. మండలంలోని పెనగడప పంచాయతీలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకులు, మినీ వాటర్ స్కీం బోర్లు పని చేయకపోవడంతో నీటికోసం అల్లాడుతున్నారు. ముస్లింవాడలో 60ఇండ్ల వారు సొంత డబ్బులతో బోరు మరమ్మతులు చేయించుకున్నారు. పంచాయతీ వారు పట్టించుకొని బోర్లను బాగు చేయించాలని, మిషన్ భగీరథ నీటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

దమ్మపేట, ఏప్రిల్ 21: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మంగళవారం దమ్మపేటలో నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

దమ్మపేట, ఏప్రిల్ 21: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దమ్మపేట మండలంలో ఆదివారం జరిగింది. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన కలిదిండి మహేంద్ర వర్మ (37)కు ఏపీలోని ఏలూరు జిల్లా, భీమవరానికి చెందిన మహిళతో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాల కారణంగా ఐదు నెలల క్రితం మహేంద్ర అల్లిపల్లిలోని సొంత ఇంటికి వచ్చి వుంటున్నాడు. ఆదివారం తనకు తెలిసిన వాళ్లు భూమి కొనడానికి వచ్చారని, దమ్మపేటకు వెళ్లి వస్తానని మహేంద్ర తల్లికి చెప్పి వెళ్లాడు. సాయంత్రం దమ్మపేట శివారులోని నెమలిపేట వద్ద పామాయిల్ తోటలో మహేంద్ర మృతిచెంది వున్నట్లు మృతుడి తమ్ముడు విజయరామ రాజు తన తల్లి ప్రమీలా రాణికి ఫోన్ చేసి చెప్పాడు. తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ ప్రచార రథం ప్రారంభం

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతకాని, ఏప్రిల్ 21: మండలంలోని చింతకానిలో బీఆర్ఎస్ ప్రచార రథాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు గురజాల హనుమంతరావు, పర్చగాని తిరుపతి కిశోర్, బోడ్డు వెంకట్రామయ్య, పఠాన్ షబ్బీర్ ఖాన్, వేముల నర్సయ్య, అంబటి వెంకటేశ్వర్లు, ఆదాము, అరవింద్, కృష్ణ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ మందులు పంపిణీ

కారేపల్లి, ఏప్రిల్ 21: వడదెబ్బ నివారణకు హోమియో మందులను ఆదివారం కారేపల్లిలో హోమియోపతి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరికపండ్ల అశోక్ పంపిణీ చేశారు. వడదెబ్బ నుంచి ఈ మందులు రక్షిస్తాయని ఆయన చెప్పారు.

కారేపల్లి సంత సందర్శన

సంతకు వచ్చిన మేకలను పరిశీలిస్తున్న డీసీ

కారేపల్లి, ఏప్రిల్ 21: కారేపల్లి వేంకటేశ్వరస్వామి వారాంతపు సంతను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్(డీసీ) తన్నీరు శ్రీకాంత్ రావు ఆదివారం సందర్శించారు. వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు.

పన్ను తగ్గింపునకు మరో తొమ్మిది రోజులు

మధిర, ఏప్రిల్ 21: ఈ నెల 30వ తేదీ నాటికి ఇంటి పన్ను చెల్లిస్తే.. ఐదు శాతం తగ్గింపు ఉంటుందని మధిర మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను వసూళ్లకు బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో, ఆన్‌లైన్‌లో కూడా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ సాయి అలేఖ్యకు సన్మానం

సాయి అలేఖ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోనకల్లు, ఏప్రిల్ 21: సివిల్స్ ఫలితాల్లో 938వ ర్యాంక్ సాధించిన మండలంలోని గోవిందాపురం-ఎల్ గ్రామస్తురాలు సాయి అలేఖ్యను, ఆమె తల్లిదండ్రులను గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. ఇష్టంతో, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించి, గ్రామానికి మంచి పేరు తెచ్చావంటూ అలేఖ్యను అభినందించారు.

మోటమర్రిలో ఘర్షణ

బోనకల్లు, ఏప్రిల్ 21: మండలంలోని మోటమర్రి గ్రామంలో ఆదివారం ఒకే సామాజిక వర్గంలోని రెండు పక్షాలు ఘర్షణకు దిగాయి. గ్రామంలో శ్రీకంఠమహేశ్వర దేవాలయ నిర్మాణ పనులు గతంలో ఆగిపోయాయి. వీటిని ఒక సామాజిక వర్గం పెద్దల ఆధ్వర్యంలో యువత చేపట్టింది. ఈ క్రమంలోనే రెండు పక్షాల మధ్య ఏర్పడిన వాగ్వివాదం.. ఘర్షణకు దారితీసింది. బుర్రి నాగేశ్వరరావు, గుడిద నాగేశ్వరరావు, వంగాల నరేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

వేంసూరు, ఏప్రిల్ 21: కందుకూరులోని కురుమల ఆరాధ్య దైవమైన బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి అనేకమంది భక్తులు పాల్గొంటారని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుబల్లి, ఏప్రిల్ 21: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకున్నది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం మేడిచెట్టువారిపాలెం గ్రామానికి చెందిన పాశం వెంకటేశ్వరరావు శనివారం పెనుబల్లి మండలం అగ్రహారం గ్రామంలో తన బంధువుల ఇంటికి ఓ వివాహానికి వచ్చాడు. రాత్రి తన టీవీఎస్ వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బంధువులు అతడిని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో లారీడ్రైవర్..

సత్తుపల్లి, ఏప్రిల్ 21: గుండెపోటుతో ఓ లారీడ్రైవర్ మృతిచెందిన ఘటన కల్లూరులో ఆదివారం చోటు చేసుకున్నది. కరీంనగర్ జిల్లా రామాపుర్‌కు చెందిన ఎండీ.ఖలీల్ (65) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అనకాపల్లి నుంచి సిద్దిపేటకు చింతగింజల లోడ్‌తో వెళ్తున్నాడు. కల్లూరు పట్టణంలోని ఓ హోటల్ వద్ద భోజనం చేసి తిరిగి లారీ ఎక్కే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. దీంతో పక్కనే తోటి డ్రైవర్ నర్సయ్య ఖలీల్‌ను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై షాకీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రీడమ్ పార్కులో వ్యర్థాలను తొలగించాలి

ఖమ్మం, ఏప్రిల్ 21: ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో ఉన్న ఫ్రీడం పార్కు వాకింగ్‌ట్రాక్‌పై ఉన్న నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ కోరారు. ఆదివారం మాస్‌లైన్ ప్రతినిధి బృందం ఫ్రీడం పార్కును సందర్శించి వాకింగ్‌ట్రాక్‌పై పోసిన మట్టి, రాళ్ల కుప్పలను పరిశీలించారు. వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, శ్రీను, ఆజాద్, శోభ, భరత్, రాకేష్, రవీందర్ పాల్గొన్నారు.

పార్క్‌లో రాళ్ల కుప్పలను పరిశీలిస్తున్న అశోక్